

జలం.. పుష్కలం

భూగర్భ జలాలు పెరిగాయి. మెట్ట నేలల్లోని ఊట బావులు నిండు కుండలా దర్శనమిస్తున్నాయి. వివరాలు 8లో ▸



ధర్మం, జాతీయత..

ధర్మం, జాతీయతా కోసం ఆర్ఎస్ఎస్ ఒక్కటే పనిచేస్తోందని కార్యవాహ కాచం రమేశ్ పేర్కొన్నారు. వివరాలు 8లో ▸



ఘనంగా జాషువా జయంతి

కేవీపీఎస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని ఘనంగా నిర్వహించారు.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లకు గడువు లేదు

జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాహనాల నంబరు ప్లేట్ల మార్పుపై వాహనదారులు ఆందోళన చెందవద్దని జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ తెలిపారు. పాత వాహనాలకు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ)లు బిగించేందుకు ఎలాంటి గడువును ప్రభుత్వం విధించలేదన్నారు. సెప్టెంబరు 30లోగా హెచ్ఎస్ఆర్పీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, లేకుంటే రవాణా, పోలీసు శాఖల ఆధ్వర్యంలో జరిమానాలు విధిస్తారనే సోషల్ మీడియా ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వాహనాలకు నంబరు ప్లేట్ల మార్పు అంశం ఇంకా ప్రభుత్వ పరిశీలనలోనే ఉందన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను వాహనదారులు నమ్మవద్దన్నారు.

మల్లన్న సన్నిధిలో పాట్నా హైకోర్టు జడ్జి



ఆలయంలో పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అనుపమ చక్రవర్తి తదితరులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న స్వామిని పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అనుపమ చక్రవర్తి ఆదివారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదం, స్వామి వారి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో సిద్దిపేట జడ్జి జస్టిస్ సాధన, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకిలో నాకాబందీ



నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి -కల్లెపెల్లి రోడ్డులో ఎస్ఐ సౌజన్య ఆధ్వర్యంలో ఆదివారం నాకాబందీ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు పరిశీలించారు. నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు.

గణేశ్‌కు నిఫా పురస్కారం



బండి సంజయ్ నుంచి అవార్డు అందుకుంటున్న గణేశ్

తొగుట (దుబ్బాక): అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ నిఫా (నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరం ఆఫ్ ఆర్టిస్ట్ యాక్టివిస్ట్) సిల్వర్ జూబ్లీ జిల్లా స్థాయి అవార్డును మండల పరిధిలోని వెంకట్రావుపేటకు చెందిన తెలంగాణ ఉద్యమ కవి, గాయకుడు, సామాజిక కార్యకర్త బండకాడి గణేశ్ అందుకున్నారు. ఈ మేరకు కేంద్రమంత్రి బండి సంజయ్ నుంచి ఆదివారం కరీంనగర్‌లో అందుకున్నారు. గణేష్ మాట్లాడుతూ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అవార్డుకు ఎంపిక చేసిన నిఫా రాష్ట్ర అధ్యక్షుడు యాదవ రాజుతో పాటు టీం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న సిద్దిపేట పట్టణంలోని సుభాష్‌రోడ్డు

ఊరూరా పూలవనాలు..
ఉవ్వెత్తున సంబురాలు

ఆటపాటలతో హోరెత్తుతున్న పల్లెలు, పట్టణాలు

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఎటు చూసినా బతుకమ్మ ఆటపాటలే కనిపిస్తున్నాయి. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా పువ్వులనే దేవతగా కొలిచే అరుదైన ఈ పండుగలో పేద, ధనిక తారతమ్యాలు లేకుండా మహిళలు, ఆడపడుచులు పాల్గొంటున్నారు. సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే బతుకమ్మ పండుగ సంబరాలు జిల్లాలో జోరుగా జరుగుతున్నాయి. సంస్కృతి సంప్రదాయాలకు పట్టుగొమ్మగా నిలిచిన ఈ ఉత్సవాలలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ సోమవారం జిల్లా వ్యాప్తంగా అత్యంత వైభవోపేతంగా జరగనుంది. ఈ మేరకు పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాట్లు చేశారు.

-ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/దుబ్బాక



సిద్దిపేట పట్టణంలో సద్దుల బతుకమ్మకు పూలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

నేడే సద్దుల బతుకమ్మ

- జిల్లా వ్యాప్తంగా పూల పండుగ ఉత్సాహం

జిల్లా ప్రజలు సద్దుల బతుకమ్మను నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. బతుకమ్మ తయారీలో వినియోగించే గునుగు, తంగేడు, బంతి, చామంతి తదితర పూలను జోరుగా విక్రయిస్తున్నారు. ప్రజలు వీటిని కొనుగోలు చేస్తున్నారు. వివిధ గ్రామాల ప్రజలు పలు పూలను సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక పట్టణాలకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు.

సద్దులకే ప్రత్యేకత

బతుకమ్మ పండుగ చివరగా తొమ్మిదో రోజున సద్దులు (పెద్ద బతుకమ్మ)కే ప్రత్యేకత. గునుగు, తంగేడు, బంతి, చిట్టి చామంతి, గడ్డిపూలతో పాటు వివిధ రకాల పూలతో అందంగా పెద్ద బతుకమ్మను పేర్చి, తోడుగా చిన్న బతుకమ్మ, పక్కనే గౌరమ్మను తయారు చేసి పూజిస్తారు. సద్దుల బతుకమ్మకు ఎంత దూరంలో ఉన్నా అందరూ తమ సొంత గ్రామాలకు వచ్చి పండుగలో పాలుపంచుకుంటారు. కొత్తగా పెళ్లయిన ఆడపడుచులు తమ తల్లి గారింటికి వస్తుంటారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు

జిల్లాలోని మహిళలకు సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఆడపడుచులకు ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. తోబుట్టువులు, తోటి మహిళలతో కలిసి ఆనంద, సంతోషాల మధ్య బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు.

చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని, పట్టణాలు, పల్లెల్లోని చెరువుల వద్ద ఏర్పాట్లు చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని కోమటి చెరువు, ఎర్ర చెరువు, నర్సాపూర్ చెరువుల వద్ద మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి.



కోమటి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న హరీశ్‌రావు



విద్యుద్దీపాల వెలుగుల్లో కోమటి చెరువు

గొప్ప పండుగ



బతుకమ్మ చాలా గొప్ప పండుగ. పండుగ వచ్చిందంటే మహిళలు, పిల్లల్లో సంబరమే. నాకు 80 ఏళ్లు. అయినా ప్రతి ఏటా తప్పకుండా బతుకమ్మను పేరుస్తా. నా పిల్లలకు బతుకమ్మ పేర్చడం, పండుగ విశేషాలు నేర్పాను. 12 ఏళ్ల వయస్సు నుంచే బతుకమ్మ ఆడుతున్నా.

- బిల్ల సరోజన, దుబ్బాక

ఘనంగా నిర్వహిస్తాం



సద్దుల బతుకమ్మ పండుగను ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తాం. పండుగకు ఆడబిడ్డలు అత్తగారింటి నుంచి తల్లి గారింటికి రావడంతో ఇళ్లన్నీ సందడితో కళకళలాడుతాయి. బతుకమ్మ పండుగ ప్రతి ఏటా సంతోషాన్ని నింపుతుంది.

- ఎర్రగుంట సుజాత, కవయిత్రి లచ్చపేట

పోటాపోటీగా పేర్చేటోళ్లం



మేము చిన్నతనంలో సద్దుల బతుకమ్మను పోటీ పడి పెద్దగా పేర్చేటోళ్లం. పండుగకు ఒక రోజు ముందే అడవికి వెళ్లి గునుగు పువ్వు కోసుకొచ్చేవాళ్లం. ఇప్పుడు సద్దుల బతుకమ్మను చిన్నగా పేర్చుతుండ్రు. అప్పటికీ ఇప్పటికీ చాలా మారిపోయింది.

- స్వాతి, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు



విద్యుద్దీపాల వెలుగుల్లో వర్గల్ క్షేత్రం

శోభాయమానం.. విద్యాధరి క్షేత్రం

- మహాచండీదేవిగా అమ్మవారు దర్శనం
- నేడు మూల మహోత్సవం



వర్గల్(గజ్వేల్): శంభునికొండ దేదీప్యమానమైంది. విద్యుత్ దీపాలతో వర్గల్ క్షేత్రం కాంతులీనుతోంది. దసరాశరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా ఆదివారం అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో భక్తజనావళికి దర్శనమిచ్చారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి నేతృత్వంలో అమ్మవారికి మహాభిషేకం, రాజోపచార, షష్ఠ్యుపచార పూజలు నిర్వహించారు. భక్తజనులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.

నేడు విశేషపూజలు, అక్షరస్వీకారాలు

ఉత్సవాలలో అత్యంత ప్రధానమైన మూల మహోత్సవానికి వర్గల్ క్షేత్రం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా నిజరూప దర్శనమిస్తారు. రంగంపేట, పుష్పగిరి పీఠాధిపతులు మాధవానంద సరస్వతి, శ్రీవిద్యాశంకర భారతి స్వామి తదితర ప్రముఖులు హాజరు కానున్నారు. రోజంతా విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు పోటెత్తనున్నారు. భారీసంఖ్యలో చిన్నారుల అక్షరాభ్యాసాలు జరుగుతాయి. ఇందుకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

మహాలక్ష్మి స్వరూపిణిగా..



మర్పడ్గలో మహాలక్ష్మి స్వరూపిణిగా అమ్మవారు

కొండపాక(గజ్వేల్): మర్పడ్గలో విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారు మహాలక్ష్మి స్వరూపిణిగా దర్శనం ఇచ్చారు. ఉదయం 6 గంటలకు క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. మహిళలు లక్ష పుష్పార్చన చేశారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని తరించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

- నాచారం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి
- శాంభవిదేవి అలంకరణలో మహంకాళీ మాత



అమ్మవారికి పూజలు చేస్తున్న మధుసూదనానంద సరస్వతి స్వామి

గజ్వేల్‌రూరల్: అమ్మవారి ఆశీస్సులు భక్తులపై ఎళ్లప్పుడూ ఉండాలని నాచారం క్షేత్రం పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి స్వామి వారు అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని మహంకాళీ దేవాలయంలో అమ్మవారు శాంభవిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న రాజశ్యామల ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదనానంద సరస్వతి స్వామివారు మాట్లాడుతూ ప్రస్తుత యాంత్రిక జీవనంలో కొంత సమయం దైవచింతనకు కేటాయించాలన్నారు.



సామూహిక కుంకుమార్చన

నంగునూరు(సిద్దిపేట): దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు మహచండీగా దర్శనమిచ్చారు. బద్దిపడగలో వీరసావర్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు.

బోర్డులే దర్శనం.. మైదానాలు నిరుపయోగం



ఎల్లాయపల్లిలో బోర్డుకే పరిమితమైన క్రీడా ప్రాంగణం

చిన్నకోడూరు(సిద్దిపేట): గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిర్వహణ లేక, సరైన వసతులు లేక బోర్డులకే పరిమితమయ్యాయి. ముళ్ల పొదలు, చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. దీంతో లక్షల నిధులు వృథాగా అయ్యాయి. కొన్ని క్రీడా ప్రాంగణాల్లో వసతులు లేక క్రీడాకారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా గ్రామాల్లో క్రీడా సామగ్రి కనిపించక కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. అధికారులు స్పందించి వీటిని అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పెంపుడు జంతువులపై అప్రమత్తత అవసరం

జిల్లా పశువైద్య, సంవర్ధక శాఖాధికారి పూర్ణచందర్‌రావు



పెంపుడు జంతువుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పెంపుడు జంతువుల పట్ల అప్రమత్తతంగా ఉండాలని జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ అధికారి పూర్ణచందర్‌రావు అన్నారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పశువైద్యశాలల్లో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. పెంపుడు జంతువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు. పెంపుడు జంతువులకు వ్యాధులు సంక్రమించినపుడు తప్పనిసరిగా చికిత్స చేయించాలన్నారు. జిల్లాలోని అన్ని పశువైద్యశాలల వద్ద సిబ్బంది చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉంటారన్నారు.

ఊరెళ్తున్నారా?.. జర భద్రం

ఇంటికి తాళం వేసి వెళ్తే అప్రమత్తంగా ఉండాలి

- తాళాలు వేసిన ఇళ్లే దుండగుల టార్గెట్
- అపరిచిత వ్యక్తులపై నిఘా..
- ముందస్తు సమాచారం తప్పనిసరి
- పండుగల వేళ పోలీసుల సూచనలు

సిద్దిపేటకమాన్: బతుకమ్మ, దసరా పండుగల సెలవులు వచ్చాయి. వివిధ రకాల పనులు, ఉద్యోగ, వ్యాపార రీత్యా ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారులు, పట్టణాల్లో స్థిరపడ్డారు. వరుస సెలువల నేపథ్యంలో పట్టణాల నుంచి తమ సొంత ఊర్ల బాట పట్టారు. ఇలాంటి సమయంలోనే దుండగులు తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడే అవకాశం ఉంది. నెల రోజుల క్రితం సిద్దిపేటలో తాళం వేసిన షెటర్లను ధ్వంసం చేసి చోరీలకు పాల్పడిన నిందితులను సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి అరెస్టు చేశారు. ఇలాంటి ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఇంటికి తాళం వేసి స్వగ్రామాలకు వెళ్లే వారు ముందస్తు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు.

బంగారం, నగదు ఇంట్లో ఉంచకూడదు

పండుగ సెలవుల్లో ఇంటికి తాళం వేసి ఊర్తే.. ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు ఉంచకూడదు. బ్యాంకు లాకర్‌లో భద్రపర్చుకోవడం ఉత్తమం. పగటి సమయంలో గుర్తు తెలియని దుండగులు రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తించి, టార్గెట్ చేసుకుని ఇంట్లోని బంగారం, వెండి, నగదు దోచుకెళ్తున్నారు. ఈ ఏడాది పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా పలు తాళం వేసిన ఇళ్లు, దుకాణాల షెటర్లు ధ్వంసం చేసి దుండగులు చోరీకి పాల్పడ్డారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తాళం వేసిన ఇంటి ఎదుట వరండాలో లైట్లు వెలిగేలా ఏర్పాటు చేసుకోవాలి.
- సీసీ కెమరాలు ఉన్న వారు పనిచేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి. లేని వారు ఏర్పాటు చేసుకోవాలి.
- ఎప్పుడు ఊరెళ్తున్నారు? తిరిగి ఎప్పుడు వస్తారో వంటి వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్‌ను పోలీసు స్టేషన్‌లో తెలియజేస్తే ఆ ఏరియాలో మరింత గస్తీ పెంచే అవకాశం ఉంటుంది.
- కాలనీలో గుర్తు తెలియని, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి.
- అర్ధరాత్రి నుంచి వాచ్‌మెన్‌లను అప్రమత్తంగా ఉండాలని తెలపాలి.
- బంగారం, నగదు, విలువైన వస్తువులు బ్యాంకు లాకర్‌లో భద్రపర్చుకోవాలి.
- అనుమానిత వ్యక్తుల కదలికలపై డయల్ 100 లేదా సంబంధిత పోలీసులకు సమాచారం తెలపాలి.



సిద్దిపేట పట్టణంలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన దుండగులు (ఫైల్)

సమాచారం ఇవ్వాలి



పండుగల సెలవుల వేళ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వరుస సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళం వేసి ఊర్లె వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. దొంగతనాలు జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశాం.

- సీహెచ్ కుశాల్కర్, అదనపు డీసీపీ అడ్మిన్

రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం



వరుస సెలవుల నేపథ్యంలో పట్టణంలో, కాలనీల్లో రాత్రి వేళల్లో బ్లూకోల్ట్ సిబ్బందితో నిరంతరం నిఘా ఏర్పాటు చేశాం. అనుమానాస్పద వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైజ్‌తో పరిశీలించనున్నాం. ప్రజలు సంతోషంగా బతుకమ్మ, దసరా పండగను జరుపుకోవాలి.

- వాసుదేవరావు, సిద్దిపేట వన్ టౌన్ సీఐ

క్లుప్తంగా

గుడుంబా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గుడుంబాను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. చేర్యాల ఎక్సైజ్ సీఐ నర్సింహులు వివరాల ప్రకారం... మండలంలోని శివాలితండా, హనుమతండా, మల్లన్నగుట్ట తండా, రెడ్యానాయక్ తండాల్లోని గుడుంబా స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో శివాలితండాకు చెందిన లకావత్ లక్ష్మి వద్ద 19 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో మెదక్ డివిజన్ సీఐ వీణ, ఎస్ఐ సరిత, సువర్ణ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

నిజాంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన కొమ్మట పద్మ, లక్ష్మణ్ దంపతులు ఆదివారం తమ పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడటంతో పద్మ తలకు గాయాలయ్యాయి. దీంతో వెంటనే ఆమెను అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

మహాచండీ హోమం



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

నారాయణఖేడ్: మనూరు మండలం బోరంచ నల్లపోచమ్మ ఆలయంలో ఆదివారం బిచ్కుంద సంస్థాన్ స్వామిజీ సద్గురు సోమలింగ శివాచార్య ఆధ్వర్యంలో మహాచండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. పూర్ణాహుతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హోమంలో పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా



సమావేశంలో మాట్లాడుతున్న శివరాజ్‌పాటిల్

సదాశివపేట(సంగారెడ్డి): డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు శివరాజ్‌పాటిల్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని డబుల్‌బెడ్రూం కాలనీలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకృష్ణమందిరం నుంచి కాలనీ వరకు గల బీటీ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు, కాలనీలో చెత్త సేకరించకపోవడం, వీధి దీపాలు ఏర్పాటు వంటి సమస్యలను కాలనీ వాసులు విన్నవించారు. అనంతరం శివరాజ్‌పాటిల్ మాట్లాడుతూ.. అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, వారు స్పందించకపోతే సొంత నిధులతో పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాల్, మాజీ కౌన్సిలర్లు విద్యాసాగర్‌రెడ్డి, ఇంద్రమోహన్‌గౌడ్, వీరేశం, అంజయ్య, ప్రకాశ్, సత్యానారాయణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



డబుల్ బెడ్రూమ్ వద్ద హైవోల్టేజ్ స్తంభాన్ని అల్లుకున్న తీగలు

కంది(సంగారెడ్డి): పిచ్చి మొక్కలు తీగలు విద్యుత్ స్తంభాలను అల్లుకుని ప్రమాదకరంగా మారుతున్నాయి. మండల కేంద్రమైన కంది శివారులో గల డబుల్ బెడ్రూమ్‌ల వద్ద హైవోల్టేజ్ స్తంభానికి తీగలు అల్లుకోవడంతో షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలకు అల్లుకున్న తీగలను తొలగించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

జలం.. పుష్కలం

మెట్ట నేలల్లోని బావుల్లో నీరు
- రెండు నెలల కింద 30 అడుగుల లోతులో..
- భారీ వర్షాలకు పైపైకి
- యాసంగికి నీటి కష్టాలు తప్పినట్టే



గాంధీనగర్‌లో కరువులో తవ్విన బావి ప్రస్తుతం నిండుకుండలా దర్శనమిస్తున్న దృశ్యం



ఉమ్మాపూర్‌లో భూగర్భ జలశాఖ ఏర్పాటు చేసిన బోరులో నీటిని లెక్కిస్తున్న అధికారులు

హుస్నాబాద్‌రూరల్: జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయి. అడుగులోతులో నీరు ఉండటంతో మెట్ట నేలల్లోని ఊట బావులు నిండు కుండలా దర్శనమిస్తున్నాయి. వానాకాలం మొదట్లో వర్షాలు లేక, బావుల్లో నీరు లేక రైతులు సాగుకు ఇబ్బందులు పడ్డారు. భూగర్భ జలాలు జులై చివరి వరకు 30 అడుగుల లోతులో ఉన్నాయి. 60 రోజుల్లోనే పైకి రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వానాకాలం వరి నాట్లు ఆలస్యమైనా, యాసంగి పంటలకు కావల్సిన నీళ్లు బావుల్లో ఉండటంతో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. హుస్నాబాద్ మెట్ట ప్రాంతానికి సాగు నీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు గొలుసు కట్టు చెరువులు, ఊట బావులు, బోరు బావుల్లో వచ్చే నీటితోనే పంటలు సాగు చేస్తారు. యాసంగి సాగుకు రైతులు విత్తనాలను సేకరిస్తున్నారు. రైతులకు వ్యవసాయ బావుల్లో నీటి లభ్యత పెరగడంతో యాసంగి పంటల సాగుపై ఆశలు పెంచుకుంటున్నారు.

ప్రతి నెల లెక్కిస్తారు..

భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో ప్రతి నెల జలాలు లెక్కిస్తారు. గ్రామాల్లో 30 కి.మీలకు ఒక బోరు బావిని ఏర్పాటు చేసి భూగర్భ జలాల అభివృద్ధిని లెక్కిస్తారు. కోహెడ మండలం రాంచంద్రాపూర్, హుస్నాబాద్ మండలం ఉమ్మాపూర్, జనగామ జిల్లా నర్మెట్టలో ఏర్పాటు చేసిన బోరు బావుల్లో నీటి లభ్యతను భూగర్భ జలశాఖ అధికారులు లెక్కించారు. మే నెలలో 28 అడుగుల లోతున ఉన్న జలం జూలైలో 30 అడుగుల కిందకు పడిపోయింది.

నీటి కోసం భగీరథ ప్రయత్నం

హుస్నాబాద్ మెట్ట ప్రాంతం కావడంతో నీటి వనరులు లేక భూగర్భ జలాలు అడుగంటి పోయి పంట చేళ్లకు సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడేవారు. వేసవిలో వ్యవసాయ బావిపై క్రేన్ వేసి లోతుగా తవ్వుకుంటారు. ఒక్కొక్క రైతు రూ.2లక్షల నుంచి రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టినా యాసంగి చివరి పంటలకు సాగు నీరు అందక ఎండిపోయి నష్టపోయేవారు. పదేళ్ల నుంచి ఎప్పుడు చూడని నీటి ఊటలు రావడంతో బావుల్లో నీరు చేతికి అందే ఎత్తులో వచ్చాయి. దీంతో యాసంగికి ఇబ్బందులు ఉండవని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అడుగు ఎత్తులో నీరు

రాష్ట్ర భూగర్భ జలశాఖ, స్వాన్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ భూగర్భ జలాలను లెక్కిస్తుంది. జూన్‌లో 30 అడుగులకు పడిపోయిన ఊట నీరు ఇప్పుడు అడుగు ఎత్తులోకి వచ్చేసింది. వర్షాలు క్రమం తప్పకుండా పడటంతో వ్యవసాయ పంటలకు నీటి వినియోగం తగ్గి వర్షం నీరు చెరువు, కుంటల్లోకి చేరి భూగర్భ జలాలు పెరుగుతున్నాయి.
– ఎం.డీ. నసీర్, స్వాన్ ప్రతినిధి




సమావేశంలో పాల్గొన్న స్వయం సేవకులు, మాట్లాడుతున్న కాచం రమేశ్

ధర్మం, జాతీయత ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

గజ్వేల్‌రూరల్: ధర్మం, జాతీయతా భావం కోసం పనిచేస్తూ నిలబడే సంస్థ ఆర్‌ఎస్‌ఎస్(రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) ఒక్కటేనని తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేశ్ పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 సంవత్సరాలైన సందర్భంగా పట్టణంలోని ఎస్ కన్వెన్షన్‌లో ఆదివారం శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన బుక్క రమేశ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రపంచంలో చాలా సంస్థలు ఉద్భవించినప్పటికీ వందేళ్ల పాటు లక్ష్యం కోసం నిలబడింది ఆర్‌ఎస్‌ఎస్ మాత్రమేనని గుర్తు చేశారు. 1925లో విజయదశమి రోజున డాక్టర్ కేశవరావ్ బలీరామ్ హెడ్గేవర్ చేతుల మీదుగా పురుడు పోసుకున్నట్లు తెలిపారు. దేశంలో ఉన్న ప్రతి పౌరుడిని జాతీయ భావాలు కలిగిన పౌరులుగా తయారు చేసే బాధ్యతను భుజాన వేసుకొని ధర్మాన్ని కాపాడుతూ, ఎక్కడైనా విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు ఆర్‌ఎస్‌ఎస్ అండగా నిలుస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసతా వేదిక తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు డాక్టర్ నరేశ్‌బాబు, వివిధ సంఘాల బాధ్యులు, మహిళలు, స్వయం సేవకులు పాల్గొన్నారు.

రోడ్డుపై నాట్లు వేసి నిరసన



గుండారం రోడ్డుపై బురదలో వరి నాట్లు వేస్తున్న యువకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారంలో రోడ్డుపై పడ్డ గుంతల్లో గ్రామ యువకులు వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. రోడ్లు గుంతలు పడి బురద పేరుకుని వాహనదారులు అవస్థలు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఆ గుంతల్లో నాట్లు వేసి నిరసన తెలిపినట్లు సాన వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేశ్, రాజు, సాయి, రమేశ్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి టౌన్ : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ వివరాల ప్రకారం... కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా చంద్రాస్ లాడ్జి వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి 42 ఏళ్లు ఉంటాయని, ఒంటిపై బ్లూ కలర్ షర్టు, ఎడమ చేతిపై ఔ అనే అక్షరంతో పచ్చబొట్టు ఉన్నదని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాసాయిపేటలో అనారోగ్యంతో..

చేగుంట(తూప్రాన్): అనారోగ్యంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ చిలుకలూరిపేటకు చెందిన కైలా విజయ్‌కుమార్(38) రెండేళ్లుగా మాసాయిపేట సఫ్రాన్ వ్యాలీలో వంట మనిషిగా పని చేస్తున్నాడు. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విజయ్‌కుమార్ శనివారం రాత్రి విధులు ముగించుకొని పడుకున్నాడు. ఆదివారం ఉదయం అక్కడే పనులు చేసే మేస్త్రీ కృష్ణ అతడ్ని నిద్ర లేపేందుకు ప్రయత్నించాడు. అతడు లేవకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిజాంపేట్ మండలంలో మృతదేహం..

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట్ మండలం నాగధర్ మొదళ్లకుంట తండా వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కల్హేర్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి వివరాల ప్రకారం... ఆదివారం వాగులో కొట్టుకొచ్చి వంతెన కింద ఉంది. వివరాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాగితపు బతుకమ్మతో ఉపాధి

రూ.350 నుంచి రూ. 1500 వరకు విక్రయాలు



అందంగా తయారు చేసిన కాగితాల బతుకమ్మలు



కాగితాలతో బతుకమ్మ తయారు చేస్తున్న దృశ్యం

కొడిపల్లి(నర్సాపూర్): పూలను పూజించే పండుగ బతుకమ్మ. తెలంగాణలో ఎంతో ప్రఖ్యాతి గాంచింది. కాగా నేడు బతుకమ్మలకు పూలు కరువయ్యాయి. దీంతో కాగితాల బతుకమ్మ వైపు జనం చూస్తుండగా తయారు చేసేవారికి ఉపాధి లభిస్తుంది. బతుకమ్మకు ప్రధానంగా గ్రామీణ ప్రాంతంలో గునుగు పువ్వుతోపాటు తంగేడు పూలను అధికంగా వాడుతారు. రంగురంగుల పూలతో మహిళలు బతుకమ్మను పేరుస్తారు. కాగా ఇందులో గునుగు పువ్వుది ప్రధాన పాత్ర. ప్రస్తుతం గునుగు, తంగేడు పువ్వులు లభించకపోవడంతో బంతి, ఇతర పువ్వులకు అధిక ధరలు ఉన్నాయి. దీనికితోడు పెద్ద బతుకమ్మను పువ్వులతో పేర్చడం శ్రమతో కూడుకున్న పని. దీనికి ప్రత్యామ్నాయం కాగితాల బతుకమ్మ. ఇటు పూల సమస్యకు, అటు శ్రమ సమయం ఆదా చేసుకునే వీలు ఉండటంతో జనం కాగితాల బతుకమ్మ కొనుగోలు చేస్తున్నారు.

కొన్నేళ్లుగా తయారీ

మండల కేంద్రమైన కొడిపల్లి గ్రామానికి చెందిన మ్యాదరి దుర్గయ్య, కిష్టయ్య, శేఖులు, ఎరుకల దుర్గేశ్, శేఖర్ కుటుంబాలకు చెందిన వ్యక్తులు కాగితాల బతుకమ్మలను కొన్నేళ్లుగా తయారు చేస్తున్నారు. పండుగ సీజన్‌లో సుమారు నెల రోజులపాటు తయారీ చేసి ఉపాధి పొందుతున్నారు. ఈత కమ్మలతో బతుకమ్మ బుట్టని అల్లి వివిధ రంగుల కాగితాలతో అందమైన ఆకారంలో కత్తిరించి అతికించి బతుకమ్మలను తయారు చేస్తున్నారు. ఒక్కో కాగితాల బతుకమ్మకు సైజును బట్టి రూ.350 నుంచి రూ.1500వరకు అమ్ముతున్నారు.

ఆర్మీ జవాన్ ఆత్మహత్యాయత్నం

ఆస్తి విషయంలో కుటుంబంతో గొడవే కారణం



అశోక్‌గౌడ్



సూసైడ్‌నోట్

దుబ్బాకరూరల్: ఆస్తి తగాదాలతో ఆర్మీ జవాన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని చీకోడ్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొడ్ల అశోక్‌గౌడ్ ఆర్మీలో జవాన్‌గా పని చేస్తున్నాడు. పదేళ్ల నుంచి ఆస్తి విషయంలో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి గ్రామానికి వచ్చి తన బాబాయి ఇంట్లో ఉన్నాడు. తల్లి, తమ్ముళ్లు ఇంటికి రానివ్వకపోవడంతో మనస్తాపానికి గురై ఆదివారం ఉదయం సూసైడ్ నోట్ రాసి, చనిపోతున్నానని సెల్ఫీ వీడియో తీశాడు. తన తల్లి, తమ్ముళ్లు ఆస్తి పంచడం లేదని, ఇంటికి రానివ్వడం లేదన్నాడు. నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామ శివారులో అతడు పడిపోయి ఉండటం చూసిన గ్రామస్తులు కుటుంబీకులకు సమాచారం అందించారు. వారి చిన్నాన్న కుమారులు అక్కడికి వెళ్లి అతడ్ని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా సూసైడ్ సెల్ఫీ వీడియో వాట్సప్ గ్రూప్‌లలో వైరల్‌గా మారింది. అశోక్‌గౌడ్‌కు తెలియకుండా ఇటీవల తల్లి, తమ్ముళ్లు కలిసి హైదరాబాద్‌లో ఉన్న ప్లాట్‌ను అమ్ముకున్నట్లు సమాచారం.

అదృశ్యమై.. బావిలో శవమై

మృతి చెందిన యువకుడు



నర్సింహులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బావిలో పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని నబీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ కృష్ణారెడ్డి, గ్రామస్తులు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బింగి నర్సింహులు(28) హమాలి పనితో పాటు, వ్యవసాయం చేసేవాడు. నాలుగేళ్ల క్రితం ప్రేమలో విఫలంతోపాటు పెళ్లి కుదరకపోవడంతో రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి బతికాడు. దీంతో మద్యానికి బానిసై ఇంట్లో తల్లిదండ్రులతో తరచూ గొడవకు దిగేవాడు. ఈనెల 24న గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టు ప్రక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం రాత్రి గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో శవమై తేలాడు. రాత్రి కావడంతో ఆదివారం ఉదయం గ్రామస్తులు, పోలీసుల సహకారంతో శవాన్ని బయటకు తీశారు. మృతదేహం మొత్తం కుళ్లిపోవడంతో వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

పట్టుబట్టి.. కొలువులు కొట్టి

గ్రూప్-2లో విజయ కేతనం..



చిగురు అనిల్



జిగిరి శ్రీనివాస్

దుబ్బాక రూరల్: అక్బర్‌పేట – భూంపల్లి మండలం చిట్టాపూర్ గ్రామానికి చెందిన చిగురు బుచ్చయ్య, భారతి దంపతుల కుమారుడు అనిల్ గ్రూప్– 2లో 270వ ర్యాంక్ సాధించి ఏఎస్ఓగా జాబ్ సాధించాడు. కుటుంబ నేపథ్యం వ్యవసాయం.

ఇదే గ్రామానికి చెందిన జిగిరి బాలమల్లయ్య, నాగవ్వ దంపతుల కుమారుడు శ్రీనివాస్ 2019లో పంచాయతీ సెక్రటరీ, 2020లో సివిల్ సప్లై కానిస్టేబుల్, 2024లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం గ్రూప్'– 2లో 285వ ర్యాంక్ సాధించి ఎక్సైజ్ ఎస్ఐగా ఎంపికయ్యాడు.

ప్రతిభ చాటిన ఖేడ్ వాసులు



రాజ్‌కుమార్



బి.మనోహర్‌రావు

నారాయణఖేడ్: గ్రూప్ – 2 ఉద్యోగాల నియామక ప్రక్రియలో నారాయణఖేడ్ జంట గ్రామం మంగల్‌పేట్‌కు చెందిన రాజ్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో ఓపెన్ కేటగిరిలో 168వ ర్యాంకు సాధించి ఏఎస్ఓ ఉద్యోగం దక్కించుకున్నాడు. జోనల్ విభాగంలో 28వ ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి ప్రాథమిక స్థాయి నుంచి నవోదయలో విద్యాభ్యాసం చేశాడు. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌కు చెందిన బి.మనోహర్‌రావు సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం దక్కించుకున్నాడు. జోనల్ స్థాయిలో మొదటి ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు పొందాడు. హైదరాబాద్‌లోని వీవీ కళాశాలలో 2012లో ఎకనామిక్స్ విభాగంలో పీజీ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించాడు.



తేజస్వినిని సన్మానిస్తున్న కంకోల్ గ్రామ పెద్దలు

డిప్యూటీ కలెక్టర్‌గా తేజస్విని

మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన మడపతి సంగమేశ్, ప్రసూన దంపతుల ఒక్కగానొక్క కూతురు తేజస్విని. 2021లో సంగారెడ్డికి చెందిన సోమనాథ్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఇటీవల విడుదల చేసిన గ్రూప్ -1 ఫైనల్ సెలక్షన్‌లో భాగంగా బీసీ -ఏ మహిళా విభాగంలో 1వ ర్యాంక్ సాధించి జనగామ డిప్యూటీ కలెక్టర్‌గా ఆమె ఎంపికయ్యారు. కాగా గ్రామానికి చెందిన బస్వరాజ్, సంగమేశ్వర్, బంధువులు ఆమెను సన్మానించారు.

ఆదర్శం.. పేదింటి కుసుమం



ముత్యాల రాజశేఖర్

కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామంలో పేద కుటుంబంలో జన్మించిన అన్నదమ్ముల్లో ఒకరికి ప్రభుత్వ ఉన్నత ఉద్యోగం రాగా.. మరొకరికి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో (నీట్)లో కన్వీనర్ కోటాలో ఫ్రీ సీటు సాధించాడు. గ్రామానికి చెందిన ముత్యాల మల్లేశం– యాదవ్వలకు ఇద్దరు కుమారులు. తల్లి బీడీ కార్మికురాలు, తండ్రి వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ -1 ఉద్యోగాల్లో పెద్ద కుమారుడు రాజశేఖర్ జిల్లా విద్యాధికారి (డీఈఓ) ఉద్యోగం పొందాడు.

పట్టు వదలని విక్రమార్కుడిలా..

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణానికి చెందిన యాదారం నవీన్ గౌడ్ గ్రూప్–2 ఫలితాల్లో స్టేట్ 166 వ ర్యాంక్ సాధించి సత్తా చాటాడు. ఆదివారం ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో అసిస్టెంట్ లేబర్ అధికారిగా ఎంపికయ్యాడు. తండ్రి రాములు నవీన్ చిన్న తనంలోనే అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తల్లి లక్ష్మి బీడీలు చుడుతూ.. కిరాయి ఇంటిలో అద్దెకు ఉంటూ.. కొడుకును కష్టపడి చదివించింది. తల్లి, భార్య ప్రోత్సాహంతో చదివి గ్రూప్-2లో సత్తా చాటి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. దీంతో పలువురు అతడిని అభినందించారు.



నవీన్ గౌడ్

గ్రూప్స్ ఫలితాల్లో సత్తా చాటిన ఉమ్మడి జిల్లా వాసులు

259 వ ర్యాంకు సాధించి..



విజయసేనారెడ్డి

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీ కొండాపూర్ గ్రామానికి చెందిన విజయసేనా రెడ్డి గ్రూప్ -2లో ర్యాంకు సాధించాడు. మక్కరాజీపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన రాష్ట్ర స్థాయిలో 259వ ర్యాంకు సాధించాడు. సచివాలయంలోని ఫైనాన్స్ విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించారు. ఆయన ఉద్యోగం సాధించడం పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

గ్రూప్ -1 లక్ష్యం



అర్జున్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): గ్రూపు -1 సర్వీసు లక్ష్యంగా ప్రయత్నం కొనసాగిస్తానని పాపన్నపేటకు చెందిన కుకునూరు అర్జున్ రెడ్డి తెలిపారు. ఇంజినీరింగ్ చేసిన అతడు 2014లో గ్రూప్–4 పరీక్ష రాసి జిల్లా స్థాయిలో 12వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం ఆర్ఐ క్యాడర్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల వెల్లడించిన గ్రూప్ -3లో స్టేట్ మొదటి ర్యాంకు, గ్రూప్ -2లో 18వ ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్ పోస్టుకు ఎంపికయ్యాడు. తాను గ్రూప్ - 1 సర్వీస్‌కు ఎంపికై ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే తన లక్ష్యమని చెప్పాడు.

సివిల్స్ సాధిస్తా..



సుస్మిత

పాపన్నపేట మండలంలోని అబ్లాపూర్‌కు చెందిన బాయికాడి సుస్మిత సివిల్ సర్వీస్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. ఎమ్మెస్సీ బీఈడీ చేసి 2012లో డీసీసీబీ అసిస్టెంట్ మేనేజర్‌గా ఎంపికయ్యారు. 2012లో వివాహం జరిగింది. భర్త శ్రీనివాస్ టీచర్. వారికి ఇద్దరు పిల్లలు. అయినప్పటికీ కుటుంబీకుల ప్రోత్సాహంతో పోటీ పరీక్షలు రాస్తున్నారు. గ్రూప్ -2లో రాష్ట్రస్థాయిలో 41వ ర్యాంకు, మహిళల్లో సెకండ్ ర్యాంక్ సాధించి, డిప్యూటీ తహసీల్దార్ పోస్టుకు ఎంపికయ్యారు. ప్రస్తుతం ఇంటి వద్దే సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు.